ఒకేపోలికతో
ఇద్దరు వుండడం
ఆశ్చర్యం కావచ్చు.
కానీ ఇక్కడ
జరిగింది అద్భుతం?

# కుడిభుజం

మైనంపాటి
భాస్కర్
కథ

ఇవాళ చాలా స్పెషల్ డే!

అదేమిటో చివర్లో చెబుతాను.

ఇలాంటి వెరీస్పెషల్ డేని హాయిగా సెలెబ్రేట్ చేసుకుంటూ గడిపెయ్యకుండా, ఆఫీసులో బందీ అయిపోవడం ఏమాత్రం బావుండదనిపించింది. ఆఫీసుకి ఫ్రెంచి లీవు పెట్టేసి, (చెప్పాపెట్టకుండా ఆఫీసు ఎగ్గొట్టెయ్యడాన్ని ఇంగ్లీషు వాళ్లు ఫ్రెంచి లీవు అంటారు—మీ ఊరికి మా ఊరెంత దూరమో— మా ఊరికి మీ ఊరూ అంతే దూరం! కదా!)

సరే— సరదాగా సినిమాకి వెళ్దాం అనిపించింది. సంగీత్‌లో బావ్‌స్టోకర్స్ 'డ్రాకులా' ఆడుతోంది.వెళ్లాము. ఇంటర్వెల్ దాకా చూశాక అర్థమయింది. అలనాడు క్రిస్టోఫర్ లీ నటించిన పాత సినిమా 'డ్రాకులా—ద ప్రిన్స్ ఆఫ్ డార్క్‌నెస్' కలిగించినంత హారర్ ఈ చిత్రం కలిగించ లేకపోతోంది.

అలాకాకపోతే— హారర్ చిత్రాలు చూసిచూసి వేనే షాక్‌ప్రూఫ్ అయిపోయానా! ఏమో!!

పిక్చరు మీద దృష్టి నిలవడం లేదు.

ఒకప్పుడు నిజంగా జీవించి ఉండిన ఒరిజినల్ డ్రాకులా తాలూకు అసలు కథా, కమామీషూ గుర్తొచ్చాయి.

పదిహేనో శతాబ్దంలో—

ట్రావ్‌సిల్వేనియా దేశానికి వ్లాద అవే రాజుఉండేవాడు. అతవే నిజమైన డ్రాకులా అని అంటారు.

వ్లాద తండ్రిని 'వ్లాద ద డ్రాకూల్' అని పిలిచేవాళ్లు. డ్రాకూల్ అంటే డ్రాగన్ (రాక్షసి జంతువు లాంటిది) అని అర్థం. డ్రాకూల్ కొడుకయిన ఈ రాజుని వ్లాద ద డ్రాకులా— అంటే— రాక్షసి జంతువు తాలూకు కొడుకు— అని పిలిచేవాళ్లు.

1430లో పుట్టిన డ్రాకులా చిన్నప్పుడు అతి దారుణమైన వయొలెన్స్‌ని ప్రత్యక్షంగా చూశాడు. చిన్నప్పుడే అతన్ని టర్కీ దేశస్తులు "వ్రకాక్షి" అనే కోటలో బందీగా ఉంచారు.



అతని కళ్ల ముందే అతని తండ్రిని హత్య చేశారు! అతను చూస్తుండగానే అతని అన్నని సజీవ సమాధి చేశారు! అందువలన డ్రాకులా స్వభావంలో వయొలెన్స్ ఒక అంతర్భాగమైపోయింది. తను రాజ్యం చేసిన పదేళ్లలోనూ డ్రాకులా యాభైవేల మంది మనుషులని చంపాడు! ఇనుముతో లేక కట్టెతో చేసిన శూలం మీద మనుషులని కూర్చోబెట్టి వాళ్లని అలా చావనివ్వడం అతనికి మహా ఇష్టం! శూలం మీద ఎక్కించిన మనిషి త్వరగా చావకుండా, ఆ శూలాన్ని మొద్దుగా చేయించేవాడు. దానిమీద ఎక్కించబడిన నిర్భాగ్యుడు తన బరువుకి తనే నెమ్మదిగా కిందికి జారేవాడు. కింద నుంచి అతని వంట్లో ప్రవేశించిన శూలం ప్రధానమైన ఏ అవయవాన్నో చీల్చేసి, చావుని ప్రసాదించే దాకా ఘోరమైన యాతన పడేవాడు ఆ మనిషి! ఇలా చంపడాన్ని ఇంపేలింగ్ అంటారు. ఈ పద్ధతిలో మనుషులని చంపడం డ్రాక్యులాకి ఇష్టం కాబట్టే అతన్ని వ్లాడ్—ద ఇంపేలర్ అని కూడా పిలిచేవాళ్లు.

శూలం మీద కూర్చోబెట్టడమే కాకుండా, బతికి ఉండగానే చర్మం ఒలిపించడం, గొంతు పిసికించడం, సలసల మరిగే నీళ్లలో, నూనెలో పడెయ్యడం, నిప్పుల మీద రోస్టు చేయించడం— ఇవన్నీ డ్రాకులాకి ప్రీతిపాత్రమైన మిగిలిన శిక్షలు!

ఆడవాళ్లు మహాశీలవతులుగా ఉండాలని డ్రాకులాకి విపరీతమైన పట్టింపు! వ్యభిచరించిన స్త్రీలను అతను చర్మం ఒలిపించి చంపించేవాడు.

ఒకసారి అతని కొలువులోకి వచ్చిన టర్కిష్ రాయబారులు రాజుపట్ల మర్యాద పురస్కారంగా తమ ఫెజ్ టోపీలను తీయడానికి నిరాకరిస్తే, 'మీ పని ఇట్లా ఉందా' అని, ఆ టోపీలమీద మేకులు కొట్టించాడు డ్రాకులా!

అడుక్కుతినే వాళ్లంటే అతనికి పరమ అసహ్యం! అంగవైకల్యం ఉన్న వాళ్లన్నా కూడా అయిష్టమే! ఒకసారి అలాంటి వాళ్లందరికీ విందు ఇస్తానని భోజనశాలలోకి తీసుకెళ్లి, కిటికీలు, తలుపులూ మూయించేసి, ఆ భవనానికి నిప్పుపెట్టి వాళ్లని తగలబెట్టించేశాడు.

కానీ—

దొరికిన కొన్ని చిత్తరువుల ప్రకారం చూస్తే— డ్రాకులా మహా అందగాడు! చక్కటి దుస్తులు ధరించేవాడు! అతను తన రాజ్యం మీద శత్రువుల దండయాత్రలు నిరోధించాడు. జమీందారుల అరాచకాలు అరికట్టి బీదసాదలకి భూములు ఇప్పించాడు. అట్టడుగు వర్గాల వారిలో ప్లేగు వ్యాధి ప్రబలి నందువల్లే వాళ్లని తగలబెట్టించి, ప్లేగుని అదుపులోకి తెచ్చాడనే ఇంకో వ్యాఖ్యానం కూడా ఉంది.

డ్రాకులాకి అసంఖ్యాకంగా ఉన్న రాజకీయ శత్రువులు అతనిమీద ఉన్నవీ లేనివీ కల్పించి, గోరంతలు కొండంతలు చేసి, ప్రచారం చేసి ఉంటారని ఇంకో ఊహ! డ్రాకులా రాజ్యం చేస్తున్న రోజులలోనే 'కదిలే అచ్చు యంత్రం' వాడకంలోకి రావడం వల్ల, అతని అకృత్యాలకి విపరీతమైన ప్రచారం వచ్చిందని ఇంకొక వెర్షను!

మొత్తంమీద మనకి దొరికిన ఆధారాలని బట్టి చూస్తే డ్రాకులా దయాదాక్షిణ్యాలంటే అర్థం తెలియని నరరూపరాక్షసుడనే రూఢి అవుతోంది. కొన్ని సూచనల ప్రకారం— అతను నరమాంస భక్షకుతూ, మనుషుల రక్తం తాగేవాడు కూడా అయి ఉండవచ్చు. శూలాల మీద కూర్చోబెట్టబడిన వందలాది అభాగ్యులు దుర్భరమైన బాధతో విలవిల్లాడుతుండగా— వాళ్ల మధ్య కూర్చుని విందు ఆరగిస్తున్న డ్రాకులా చిత్తరువులు కొన్ని ఉన్నాయి.

ఇన్ని ఘాతుకాలు చేసిన డ్రాకులా చివరికి తను కూడా అంత దారుణమైన చావునే ఎదుర్కోవలసి వచ్చింది. అతని శత్రువులు అతన్ని చిత్రవధ చేసి చంపారు. ఆ తర్వాత అతని తల నరికి, దాన్ని శూలానికి గుచ్చి, ఊరేగించారు.

అన్నిటికంటే చిత్రం ఏమిటంటే—

రోమానియాలోని అతని సమాధిని త్రవ్వి చూస్తే—

ఆ సమాధిలో డ్రాకులా శరీరం లేదు!

డ్రాకులా కథల ప్రకారం—అతను

చనిపోయినా కూడా సమాధిలో నుంచి లేచి వస్తాడనీ— మనుషుల రక్తం తాగుతుంటాడని — అలా రక్తం తాగబడిన మనుషులు కూడా డ్రాకులా అయిపోతారనీ చెప్పుకుంటూరు—

ఏది ఏమైనా— డ్రాకులా సమాధి తవ్వి చూస్తే అందులో అతని బాడీ లేదు!

మరి అతను లేచొస్తుగా ఎవర్ని చంపడానికి వెళ్లాడో ఏమో!

అరే!

నిజాలే ఇంత భయానకంగా ఉంటే, ఈ సినిమావాళ్లు ఏవేవో పిచ్చిపిచ్చి మసాలాలు చేర్చి, చప్పచప్పగా చేసేస్తారేం డ్రాకులా సినిమాలనీ!

మళ్లీ అదే ప్రశ్న!

డ్రాకులా గురించి ఇప్పటికి నాలుగొందల సినిమాలు వచ్చాయి. అసంఖ్యాకమైన పుస్తకాలు కూడా వచ్చాయి.

ఇవీ, ఇంకా ఇలాంటివీ చదివీ, చూసీ నాలాంటి వాళ్లం రాటుదేలి పోయామా?

థియేటర్లో సౌఖ్యంగా కూర్చుని, పాప్‌కార్న్ నములుతూ, ఒక డ్రాకులా, ఒక సైకో చూసి హాయిగా భయపడే అనుభూతి ఇంక రానేరాదా?

సినిమా అయిపోయింది.

కానీ థ్రిల్లు రాలేదు.

ఆవలిస్తూ లేచి నిలుచుని, యధాలాపంగా ముందు వరసలో నిలుచున్న మనిషిని చూశాను.

అంతే!

నా కనురెప్పలు మూతబడటం మర్చిపోయాయి!

తెరిచిన నోరు మళ్లీ మూసుకోలేదు!

ఒంట్లో రక్తం గడ్డకట్టినట్లయింది!


రాతి బొమ్మలా నిలబడిపోయి, అతన్నే చూస్తూ ఉండిపోయాను.

కాదు— కాదు— అతను డ్రాకులా కాదు— అలా అకనకోకండి!

అదృష్టవశాత్తు, అతనునన్ను చూడలేదు!

చూడకపోతేనే బాగుండని నాకు అనిపించింది.

## రాత



తెలుగు నవలా రచయిత్రిని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేకరి.

"మీరు కథలు, నవలలే కాకుండా ఇంకేమైనా రాస్తారా" అడిగాడు.

"ఆ ఎందుకు రాయను స్లిప్పులు, పొడర్లు రాస్తుంటా" అంది.

— ఎస్.అప్పలరాజు
(నెల్లిమర్ల)

జనంతోబాటు అతను మెల్లిగా కదులుతున్నాడు.

ఈ జన్మలో అలాంటి దృశ్యం చూస్తానని గానీ, అసలు ఇలాంటివి సంభవం అని గానీ నాకు కలలో కూడా తోచలేదు!

ఏదో వెగటు ఫీలింగులాంటిది కలిగింది. కడుపులో తిప్పినట్లయింది. వాంతి వచ్చేటట్లు అనిపించింది. స్పృహ తప్పి పోయిందేమోనని భయం కూడా కలిగింది.

కళ్లప్పగించి అతన్నే చూస్తూ ఉండిపోయాను.

అతను జనంతో బాటే కదులుతూ, ఐదారు నిమిషాల తర్వాత ఎగ్జిట్ డోర్ నుంచి బయటికి వెళ్లిపోయాడు.

నాకు తెలియకుండానే నేను నిస్సత్తువుగా ఓ కుర్చీలో కూలబడిపోయాను.

ఇంకో అయిదు నిమిషాల తర్వాత—

షో అయిపోగానే థియేటర్ ఊడ్చే పనిమనిషి చీపురుతో వచ్చి "ఏం సారూ! పానం బాగులేదా? అట్లనే కూకుంటివి?" అంది పరామర్శగా.

అతికష్టం మీద లేచి నిలబడ్డాను.

ఈ పాటికి అతను గేటు దాటేసి ఉంటాడు.

దేవుడి దయవల్ల వెళ్లిపోయే ఉంటే బావుందు!

అప్పుడనిపించింది నాకు—

మనం సురక్షితంగా కూర్చుని "హారర్"ని ఎంజాయ్ చెయ్యడంలో చాలా థ్రిల్ ఉంది.

కానీ—

నిజంగానేమనం ఒక హారర్ ఎపిసోడ్‌లో పాత్రలాగా ఇన్‌వాల్వ్ అయిపోతే—

అప్పుడింక థ్రిల్ కాదు—

టెర్రరే!

ఆటో ఎక్కి అర్జెంటుగా ఇంటికెళ్లిపోయాను.

ప్రస్తుతం మా ఇంట్లో నేను ఒక్కడినే ఉంటున్నాను. నా శ్రీమతి రమ్య పుట్టింటికెళ్లింది.

చిన్నగేటు తియ్యగానే, మా ఆవిడ అల్లారు ముద్దుగా పెంచుకునే రంగురంగుల పూలమొక్కలు కనబడ్డాయి.

ఒక తెల్ల గులాబీ "మీ ఆవిడేదీ? అని చిరునవ్వుతో పలకరించినట్లయింది.

నవ్వుకుని, వరండా మెట్లెక్కబోయాను.

ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్లయింది.

"అతను" కూర్చుని ఉన్నాడక్కడ!

భయంతో— పెద్దగా కేక వెయ్యాలనిపించింది.

కానీ— నోటెంబడి మాట రాలేదు నాకు.

ఇట్లాంటివి సినిమాల్లో జరగడం చూస్తాం— కథల్లో చదువుతాం..!

కానీ నిజ జీవితంలో ఇలాంటి సంభవం అని అనుకోం!

అతను కుర్చీలో కూర్చుని, తదేకంగా నావైపే చూస్తున్నాడు.

నాకు గొంతెండి పోయినట్లనిపించింది.

ఇంతకీ—

అతనెవరు?

అతన్ని చూస్తే నాకింత భయం వేస్తోంది ఎందుకూ?

అతను చూడడానికి భయంకరంగా ఏమీ లేదు!

వికృతాకారి కాడు.

జెయింట్ సైజులో ఉన్న మనిషీ కాడు.

కారు నలుపురంగులో లేడు.

మరుగుజ్జు కాడు.

అప్పులవాడు కూడా కాడు.

చూడడానికి చాలా సాదాగా ఉన్నాడతను

అంత పొడుగూ కాదు— అంత పొట్టీ కాదు—

తెలుపూ నలుపూకాని చామనఛాయ.

ప్లెయిన్‌గా ఉన్న జుట్టుని వెనక్కి దువ్వాడు.

సింపుల్‌గా ఉన్నాడు.

ఇలా ఏ ప్రత్యేకతా లేని అతనిలాంటి వాళ్లు అడుగడుక్కీ అరడజనుమంది కనబడతారు.

కానీ—

కానీ—

కానీ—

ఇతను అచ్చం నాలాగే ఉన్నాడు!

నూటికి నూరు శాతం నా ప్రతిబింబంలా ఉన్నాడు!!

సినిమాల్లో చూపించే డ్యూయల్‌రోల్ లాగా— అచ్చు నా కవల తమ్ముడో, అన్నో అనిపించేటట్లు ఉన్నాడు!!!

ఒడిదుడుకులేం లేకుండా, మరీ ఊహాతీతమైన సంఘటనలేం జరక్కుండా జీవితం గడిచిపోవాలని కోరుకునే మనిషిని నేను. షాక్‌లు ఏమీ ఎదురవకుండా, అన్నిటికీ ముందే సర్వసన్నద్ధంగా ఉంటాను. అలా ప్లానింగ్ చేసి ఉంచుతాను కూడా!

కానీ— ఇది నేను బొత్తిగా ఊహించని పరిస్థితి!

"నిన్ను నేను సంగీత్‌లో చూవా!" అన్నాడు అతను— ఉపోద్ఘాతం లేకుండా.

అచ్చం నా గొంతే!

నేనే మాట్లాడుతున్నానా?

## అగ్ని ప్రమాదాలు

అమెరికాలో జరిగే అగ్ని ప్రమాదాల్లో నూటికి ఎనభై కాల్చిపారేసిన సిగరెట్ల వలనే సంభవిస్తున్నాయట. ఇంతకు ముందు ఇస్తాంబుల్ నగరంలో కాల్చిపారేసిన సిగరెట్ వలన 5 వేల ఇండ్లు కాలిపోయాయి. అమెరికా అడవుల్లో ప్రతిరోజూ 500 అగ్ని ప్రమాదాలు జరుగుతూ వుంటే, వీటిని విమానాల ద్వారా ఆర్పుతున్నారు.

— డాక్టర్ ల



కాదు— అతను మాట్లాడుతున్నాడు.

"ఏమిటీ.. ఏమిటీ?" అన్నాను నేను, ఏం మాట్లాడుతున్నానో తెలియకుండా.

"నన్ను చూసి నువ్వు షాకయిపోతావని తెలుసు! అందుకే అందరి ముందూ నిన్ను పలకరించలా!" అన్నాడతను.

నాకు హఠాత్తుగా ఒక ఊహ తోచింది.

ఇది బహుశా కలేమో!

కలలు నాకు ఎక్కువగానే వస్తుంటాయి. ఆ కలల్లో నేను అనేకమైన కష్టాలు పడుతూ ఉంటాను. మహా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో పడిపోతుంటాను. "ఇంక ఎట్లారా భగవంతుడా" అన్న స్థితి కలలోనే వచ్చేస్తూ ఉంటుంది. అలా దిక్కు తోచకుండా ఉన్నప్పుడు చప్పున మెలకువ వచ్చేస్తూ ఉంటుంది. కలలోని కష్టాలన్నీ స్విచ్ ఆఫ్ చేసినట్లు మటుమాయమై పోతుంటాయి.

ఇదిగో!

ఇంక మెలకువ వచ్చేస్తోంది! ఇంక హాయిగా...

గట్టిగా కళ్లు నులుముకుని చూశాను.

అతను ఇంకా ఎదురుగా నిలబడే ఉన్నాడు!

చిన్నగా నవ్వి, "ఇది కలకాదు! నిజమే!" అన్నాడు.

అతికష్టం మీద గొంతు పెకిలించుకుని

"ఎవరు నువ్వు?" అని అడిగాను.

"కనబడట్లేదూ? నేనే నువ్వు. నువ్వే నేను"

"అంటే— నువ్వు చిన్నప్పుడు తప్పిపోయిన నా ట్విన్ బ్రదర్‌వా ఏం?" అన్నాను.

అతను నవ్వాడు.

"నేను నీ ట్విన్ బ్రదర్‌ని కాను— అసలు నీకు ట్విన్ బ్రదర్స్ ఎవ్వరూ లేరు".

"మరీ!"

"చెప్పట్లా! నేనే నువ్వు!"

"నా కర్థం కావట్లే!"

"ఇందులో అర్థమయేదేముంది! నువ్వే నేను— నేనే నువ్వు"

ఫ్లాష్‌లాగా ఇంకో ఆలోచన తట్టింది నాకు.

"నువ్వు సినిమాల్లో హీరో మానసిక సంఘర్షణలో ఉన్నప్పుడు కనబడే అంతరాత్మలాంటి వాడివా?" అన్నాను.

"నీకు మనసే లేదు— ఇంక సంఘర్షణ ఏమిటీ? అయినా అడిగావు కాబట్టి చెబుతున్నా— నేను అంతరాత్మని కాదు" అన్నాడు.

నా మెదడు మొద్దుబారిపోయినట్లయింది.

హీనస్వరంతో అడిగాను.

"నీకేం కావాలి?"

"నీకేమేమి కావాలో అవన్నీ నాకు కావాలి"

"నేను ఎక్కువ డబ్బున్న వాణ్ణి కాను"

"ఉన్నదే ఇద్దరం సర్దుకుందాం! నేనూ కొద్దోగొప్పో సంపాదిస్తూనే ఉంటాలే— నేను నీకు కుడిభుజం లాంటివాడిననుకో! చెప్పడం మర్చిపోయా! పొద్దున మన బ్యాంక్ అకౌంట్‌లో నుంచి ఐదొందలు తీశాను! కంగారు పడకేం!

నాకు ఒక్కసారిగా తిక్కరేగినట్లయింది. నేను డబ్బు దగ్గర చాలా గట్టి మనిషిని.

"నీకెట్లా ఇచ్చారు?" అన్నాను.

"మన సంతకం పెట్టా" అన్నాడు అతను

"ఫోర్జరీనా?"

"కాదు— 'మన' సంతకం!"

నాకు గుండె దడ మొదలయింది.

అతను సానుభూతిగా చూసి, సాఫ్ట్‌గా అన్నాడు.

"నేనూ నువ్వూ ఒకటే అంటే నమ్మట్లేదు కదూ నువ్వు?"

నేను మతిచెడిన వాడిలా నిలబడిపోయాను. తర్వాత నాకు తెలియకుండానే, ఒక కుర్చీలో కూలబడ్డాను.

అతను లోపలికెళ్లిపోయాడు.

కాసేపటి తర్వాత—

వేగుతున్న ఉల్లిపాయల వాసన వచ్చింది. ఆ తర్వాత దాన్లో వంకాయ ముక్కలు పడ్డ ఘుమఘుమ.

ఉల్లిపాయవేసిన వంకాయ కూర!

మై ఫేవరేట్ డిష్!

నా కాళ్లు వణుకుతున్నట్లు కాసేపటి తర్వాత గ్రహించాను.

అరగంట తర్వాత అతను వచ్చి పిలిచాడు

"రా! భోంచేద్దాం!"

మెకానికల్‌గా లేచాను.

అప్పటికే—డైనింగ్ టేబుల్ మీద అన్నీ వడ్డించి ఉన్నాయి.

నేను కెలుకుతున్నాను—


అతను ఆవురావురమని లాగించేస్తున్నాడు.

అన్నం కెలుకుతూ మధ్యమధ్య అతనివైపు ఓరకంటితో చూస్తున్నాను.

నూటికి రెండొందల శాతం నాలాగే ఉన్నాడు.

పెరుగన్నం జుర్రుతూ తింటున్నాడు అతను.

నాకూ అదే అలవాటు!



కొంచెం శబ్దం చేస్తూ, జుర్రుకుని తినడం!

నేను అలా తింటుంటే రమ్య చురుగ్గా చూస్తుంది.

అన్నం హితవు పోయింది నాకు.

అతను భోజనం ముగించి, నాప్‌కిన్‌తో చెయ్యి తుడుచుకుని, "గుడ్‌నైట్" అని చెప్పి, వెళ్లి నా మంచంమీద పడుకున్నాడు.

అప్పుడు ఇంకో భయంకరమైన ఆలోచన తట్టింది నాకు.

ఇతను నాతోనే తింటూ, నాతోనే ఉంటుంటాడా?

రేపు రమ్య వస్తే...

అంతకంటే ముందుకు ఆలోచించలేక పోయాను. ఒక్కసారిగా నాసియా ముంచుకొచ్చేసినట్లయింది నాకు!

పది నిమిషాల తర్వాత అతను గుర్రుపెట్టడం మొదలెట్టాడు.

రివ్వున చలిగాలి వీస్తున్నా నాకు ముచ్చెమటలు పడుతున్నాయి.

అప్పుడింకో అమోఘమైన ఆలోచన వచ్చింది.

పక్కింట్లో దక్షిణామూర్తి ఉంటున్నాడు.

అతను భూతప్రేత పిశాచాలని వశం పెట్టుకుంటాడని ప్రతీతి! గాలి సోకిన వాళ్లు అతని దగ్గరికి వచ్చి మంత్రాలు వేయించుకుంటారు. నాకెందుకోగానీ అతన్ని చూస్తేనే ;అలర్జీ! చిరాకు!

కానీ ఇప్పుడు నాకు ఆ దక్షిణామూర్తే ప్రత్యక్షదైవంలాగ అనిపించాడు. వెంటనే వాళ్లింటికెళ్లి పోయాను. సంగతంతా చెప్పాను.

"మా ఇంట్లో ఉన్నది దెయ్యమేనని నా నమ్మకం!" అన్నాను.

"అలాగా! చూద్దాం పదండి!" అని కొన్ని నిమ్మకాయలూ, పసుపూ, కుంకుమా పట్టుకుని వచ్చాడు దక్షిణామూర్తి.

బెడ్‌రూంలో నుంచి "అతని" గురక వినబడుతోంది.

"మీరిక్కడే ఉండండి" అన్నాడు దక్షిణామూర్తి గదిలోకి వెళ్తూ.

నాకర్థమయింది.

లోపలికెళ్లి ఇతనేదో మతలబుచేసి, నా దగ్గర భారీగా డబ్బులు దండుకుంటాడు.

పావుగంట తర్వాత దక్షిణామూర్తి బయటికి వచ్చాడు. అతని మొహంలో సంభ్రమం కనబడుతోంది.

"ఇదే గనక ఇంకొకళ్ల కేసయితే, దెయ్యమనీ అదనీ ఇదనీ చెప్పి, భారీగా డబ్బు ఖర్చుపెట్టించేవాడినే! కానీ మీరు పొరుగువాళ్లు కాబట్టి ఉన్నది ఉన్నట్లు చెబుతున్నాను— మీ ఇంట్లో ఉన్నది దెయ్యం కాదు. మీలాంటి మనిషే— నేను వస్తా!" అని వెళ్లిపోయాడు దక్షిణామూర్తి.

అప్రయత్నంగానే నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. అక్కడే కూలబడి, మోకాళ్లలో తలపెట్టుకుని చిన్నగా రోదించడం మొదలెట్టాను.

అప్పుడు—

హఠాత్తుగా—

నా భుజం మీద బలంగా ఒక చెయ్యి పడింది.

విహ్వలంగా వెర్రికేక పెట్టాను నేను.

తిరిగి చూస్తే—

అతను!

అనునయంగా అన్నాడు అతను.

"నేనే నువ్వంటే నువ్వు నమ్మట్లేదు కదూ?"

నా కళ్లు గాజుకళ్లలా అయిపోయాయి. అతను మసకమసగ్గా కనబడుతున్నాడు.

అతను ఒక కవరు అందించాడు.

అందులో కొన్ని రిపోర్టులు ఉన్నాయి.

మా ఇద్దరి వేలిముద్రలూ ఒకటేనని ధృవపరుస్తూ ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్టు రిపోర్టు!

మా ఇద్దరి దస్తూరీ ఒకటేనని హాండ్ రైటింగ్ ఎక్స్‌పర్ట్ రిపోర్టు!!

మా ఇద్దరి గ్రూపూ, డీ ఎన్ ఏ ఒకటేనని సైంటిస్టు చిదంబరంగారి రిపోర్టు!!!

"ఏమిటిది?" అన్నాను నేను— ప్రాణాలు కడబట్టి పోతుండగా.

అతను చెప్పడం మొదలెట్టాడు.

"కొన్నేళ్ల క్రితం— నీకు స్కూటర్ యాక్సిడెంట్ అయింది. కుడిభుజం దగ్గర బలంగా దెబ్బతగిలింది. కుడిచెయ్యి తీసెయ్యాలన్నారు డాక్టర్లు.

కుడిచేతిని శాశ్వతంగా కోల్పోతాననే ఆలోచనే నీకు మతిపోయేటట్లు చేసింది.

అప్పుడు విన్నావు నువ్వు పతంజలి గురించి.

డాక్టర్ పతంజలి వైద్యంలో ఒక అద్భుతమైన ప్రక్రియని కనిపెట్టాడు. దానికిగానూ అతనికి ఈ సంవత్సరం నోబెల్ ప్రయిజు వచ్చినా ఆశ్చర్యం లేదు!" అని చెప్పి ఒక్క క్షణం ఆగాడు అతను.

నేను శిలాప్రతిమలా కూర్చుని వింటున్నాను. అతను చెబుతున్నవన్నీ నిజంగా జరిగినవే!

అతను చెబుతూనే ఉన్నాడు.

"ప్రమాదాలలో కాళ్లూ, చేతులూ, మిగతా అవయవాలూ పోగొట్టుకున్న వాళ్లకి డాక్టర్ పతంజలి పరిశోధన వరప్రసాదంలా పనికి వస్తుంది. అయితే ఇది సృష్టిలో

## లక్షాధికారి



లక్షాధికారి అయిన సుబ్రావ్‌ని..

"ఒరే! సడన్‌గా ఇంత ధనము ఎలా సంపాదించావురా" అని అడిగాడు ఆనందం.

"ఆ... ఏముంది భూకంప విరాళాలు సేకరించి" నెమ్మదిగా అన్నాడు సుబ్రావ్.

– ఎస్.అప్పలరాజు
(నెల్లిమర్ల)

ఇదివరకు లేని ప్రక్రియ అని చెప్పడానికి లేదు. అనేక జంతువులలో దీనిని మనం గమనిస్తూనే ఉంటాం. ఉదాహరణకి బల్లి— బల్లికి తోక తెగిపోతే కొత్త తోక వస్తుంది. సాలమాండర్ అనే తొండకి కూడ అంతే! పురాణాలలో కూడా ఇలాంటిది ఉంది. రావణాసురుడికి తలలు తెగిపోతే, కొత్త తలలు వచ్చేవని చెబుతారు.

అలాగే స్టార్‌ఫిష్ ఉంది.

నక్షత్రాకారంలో ఉంటుంది స్టార్‌ఫిష్.

స్టార్‌ఫిష్ ఒక కొమ్ముపోతే కొత్త కొమ్ము వస్తుంది.

అంతేకాక—

ఊడిపోయిన ఆ కొమ్ములో నుంచి ఇంకో కొత్త స్టార్‌ఫిష్ కూడా వస్తుందన్నమాట! విన్నావా? స్టార్‌ఫిష్‌కి కొమ్ము ఊడిపోతే కొత్త కొమ్ము వస్తుంది. ఊడిపోయిన కొమ్ము లోనుంచి కొత్త స్టార్‌ఫిష్ వస్తుంది. అంటే రెండు పూర్తి స్టార్‌ఫిష్‌లు తయారవుతాయన్నమాట!

స్టార్‌ఫిష్‌లో ఈ ప్రక్రియ ఎలా జరుగుతుందో డీకోడ్ చేశాడు డాక్టర్ పతంజలి. వా: మొదటిసారిగా నీమీదే ప్రయోగించాడు.

ఫలితంగా—

తీసేసిన నీ చెయ్యిస్థానంలో నీకు కొత్త చెయ్యి వచ్చింది.

తీసేసిన ఆ చేతిలోనుంచి, అచ్చం నీలాగే ఉండే నేను పుట్టుకొచ్చాను. అంటే ఇక నుంచి నువ్వు ఒకడివి కావు— ఇద్దరివి! ఈ జీవితం మనిద్దరిదీ— నీది అనుకున్న ప్రతిదానిమీదా నాకు హక్కు ఉంటుంది'' అన్నాడు.

అతనలా అంటుండగానే—

గడియారం పన్నెండు గంటలు కొట్టడం మొదలెట్టింది.

''హాపీ న్యూఇయర్!'' అన్నాడు అతను. ''కాదు కాదు— హాపీ న్యూ సెంచరీ! కొత్త శతాబ్దం ప్రవేశించింది! ఇది ఇరవై ఒకటవ శతాబ్దం! 2000 సంవత్సరం! అవునా! ఇప్పుడింక అంతా కొత్తసైన్సు— కొత్త పరిష్కారాలు— వాటితోబాటు కొత్త సమస్యలూనూ! ఏం చేస్తావు? దిసీజ్ లైఫ్!'' అన్నాడు.

*

